ఉద్యమ కెరటం
శుక్రవారం 5 డిసెంబర్ 2025

# ఎన్నికలుకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** గ్రామపంచాయతీ ఎన్నికలను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, ఉపసర్పంచ్ ఎన్నికల ఎన్నిక పారదర్శంగా జరపాలన్నారు. ఇప్పటివరకు పూర్తి చేసిన నామినేషన్ల ప్రక్రియ, ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు సభ్యుల వివరాలను జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అందరికీ శిక్షణను పూర్తి చేయాలని చెప్పారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులందరూ పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ సమావేశం మందిరం నుంచి కలెక్టర్ రాజర్షిషా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఆర్వో స్టేజ్-2 జోనల్ అధికారులు వెంటనే పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే రోడ్డు మార్గాలను పరిశీలించాలని వివరించారు. నిర్దేశించిన జాబితా ప్రకారం పోలింగ్ కేంద్రాలలో సదుపాయాలు ఉన్నాయో లేదో చూడాలని చెప్పారు. సిబ్బంది, ఎన్నికల సామాగ్రి తరలింపునకు అనువైన వాహనాలను వెంటనే సమకూర్చాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆబ్జర్వర్ టి. వెంకన్న, ఎల్. విజయ, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి

**ఉద్యమ కెరటం, జైనూర్:** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని ఉట్నూర్ ఐటీడీఏ ఇంచార్జ్ పీఓ యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జైనూర్ మండలంలోని రాశిమెట్ట గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, గిరిజన గురుకులం కళాశాల భూశిమెట్ట aను సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు, తరగతి గదులు, ఆశ్రమ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. దీంతో ప్రతిరోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, అవసరమైన ఐరన్, సి-విటమిన్ టాబ్లెట్లను అందించాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు వంద శాతం ఉత్తీర్ణత పొందే విదంగా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వసతి గృహ పరిసరాల్లో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. చలి తీవ్రత ఎక్కువ ఉండడంతో విద్యార్థులకు ఉదయం స్నానానికి వేడి నీళ్లు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఆదేశించారు. జేఈఈ, నీట్ కు ప్రిపేర్ అయ్యేవారికి తగిన సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# సీఐటీయూ మహాసభల పోస్టర్ల విడుదల

**ఉద్యమ కెరటం, తాండూర్:** ఈనెల 7,8,9, తేదీల్లో మెదక్ జిల్లా కేంద్రంలో జరిగే సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఐదవ మహాసభల పోస్టర్లను గురువారం మండల కేంద్రంలోని ఐబీలో మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి డి రాజారామ్, మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు చల్లూరి దేవదాస్‌ల ఆధ్వర్యంలో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా ఉమ్మడి రాష్ట్ర సీఐటీయూ పూర్వ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బివి రాఘవులు హాజరవుతారని తెలిపారు. సీఐటీయూ కార్మికులకు సాధించిన హక్కులను చర్చించి భవిష్యత్తు మూడు సంవత్సరాల్లో సీఐటీయూ చేపట్టబోయే కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహించడానికి తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కే లీలారాణి, కె విజయలక్ష్మి, రామగిరి వరలక్ష్మి, గడ్డల హనుమక్క, అక్క పెల్లి కమల, ఇందూరి హనుమక్క, ఊరడి కమల, రాధా, రెడ్డి మల్లక్క, దవన బ్రమనేశ్వరి, అనిషా, దుర్గం నాన్నయ్య,కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలను కృషి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలో క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నామని నేరడిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎండి సద్దాం అన్నారు. టీబీ ముక్త్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేసి 170 మందికి వైద్య పరీక్షలు జరిపారు. ఎక్స్‌రేలతో పాటు పలు పరీక్షలు నిర్వహించి క్షయ వ్యాధి నివారణ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ లక్షణాలు, కఫంతో కూడిన దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఒకవేళ టీబీ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే ఉచిత వైద్యం, మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ సుదర్శన్, హెల్త్ సూపర్‌వైజర్ అడ్డిగా సంతోష్, స్వర్ణలత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌లో భీంపూర్ నాయకులు

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి వరుసగా షాకులు తగులుతున్నాయి. భీంపూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్ కీలక నాయకులు పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ వారికి కండువాకప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన, అభివృద్ధి పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందని, ఆ నమ్మకమే కాంగ్రెస్ పార్టీలో భారీ ఎత్తున చేరికలకు కారణమవుతోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణంలో బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ రోజురోజుకూ దూసుకుపోతోందని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన నాయకులు మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి ప్రజా పాలనలో భాగస్వామ్యం కావడానికి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో జాదవ్ కైలాష్ తో పాటు మాడవి పందు, రాథోడ్ అమృత్, రాథోడ్ అవిన్, రాథోడ్ గజ్జు, మెస్రం గోవింద్, సిడం దయానద్, సిడం గజానంద్, కుమ్రా సంతోష్, కుమ్రా రవికాంత్, వి సవన్, కుద్మేత జైతు, మాడవి మహాదు,రాథోడ్ రాజు, వి రాము, రాథోడ్ గణేశ్,పవన్, నర్సింగ్, ప్రేమ్ సింగ్, క్రిష్ణ,రాథోడ్ ప్రకాష్, గజ్జు,సచిన్, అజయ్,రాజు,గోకుల్ జాదవ్, మొతిరాం, గంగా, అజయ్, అవినాష్, అనీష్, మనీష్, రవీందర్, అర్జున్, అతుల్, అశోక్, ముకుంద రావు, బందు, రామచందర్, రాము, దౌలత్ రావు తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్‌లో చేరికలు

**ఉద్యమ కెరటం, వేములవాడ:** వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి, బాలరాజ్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికీ ప్రభుత్వ విప్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.



# ఆదిలాబాద్‌ను ఆదర్శంగా నిలబెడుతా

- ప్రజా పాలన విజయోత్సవాల్లో రేవంత్ రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధిపర్చి ఆదర్శంగా నిలబెడతానని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆదిలాబాద్ పట్టణానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, గడ్డం వినోద్, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు స్వాగతం పలికారు. అనంతరం రూ.260.45 కోట్లతో ఆదిలాబాద్ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు జిల్లాలో నెలకొన్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కారించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు, వాటి ద్వారా జరుగుతున్న అభివృద్ధి గురించి వివరించారు. పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని మాట్లాడుతూ నోరు మంచిదైతే.. ఊరు మంచిదని అంటారు. అందుకే మంత్రులతో కలిసి పనిచేసేటోళ్లను సర్పంచ్ లుగా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు జిల్లా ఉన్నత అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**శంఖుస్థాపన వివరాలు..**

- రూ. 18.70 కోట్లతో ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డుల సమగ్ర అభివృద్ధి.
- రూ. 1.75 కోట్ల పెట్టుబడితో ఇందిరా మహిళా శక్తి కింద స్వయం సహాయక మహిళా సంఘాలతో పెట్రోల్ బంక్.
- రూ. 19.69 కోట్లుతో 160 స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు.
- రూ. 200 కోట్లతో పట్టణ పరిధిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం.
- రూ. 2కోట్లతో మహాలక్ష్మివాడ, విద్యానగర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అదనపు గదుల నిర్మణం, ఆధునికీకరణ.
- ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్ నగర్ ప్రాంతంలో రూ. 11.93 కోట్లతో 18 పోలీస్ క్వార్టర్స్, రూ. 2.6 కోట్లుతో మూడు ఇంటెలిజెన్స్ విభాగం క్వార్టర్స్, రూ. 2 కోట్లతో భరోసా కేంద్రం ప్రారంభం.
- రూ. 231.24 లక్షల నిధులతో కొత్త కలెక్టరేట్ సమీపంలోని టీజీఎన్‌పీడీసీల్ ద్వారా 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు.



